క్లుప్తంగా

పూడి పోయిన కలుజు కాలువ



మరమ్మతులకు గురైయిన కలుజు కాలువ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెరిణి కండ్రిగ గ్రామంలోని చెరువు కలుజుకు కాలువ మరమ్మతులకు గురై ఉంది. దీంతో కలుజు నుంచి వచ్చే వరద నీరు పంటలపై ప్రవహిస్తుండడంతో దెబ్బతింటున్నాయి. కలుజు కాలువ కింద 251 ఎకరాలు సాగు భూమి ఉంది. కాలువ చెట్లు, పుట్టలతో పూడిపోయి ఉంది. కలుజుకు కాలువకు మరమ్మతులు చేపట్టాలని ఇరిగేషన్‌శాఖ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కలుజు నీరు పారేలా కాలువకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయ ధ్వజస్తంభం వద్ద సురేష్‌చంద్ర

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని బుధవారం సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ సురేష్‌చంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.

సంప్రదాయ దుస్తుల్లో రష్యన్ భక్తులు



చీరకట్టులో విదేశీ మహిళలు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం పలు దేశాల నుంచి నిత్యం భక్తులు వస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం శ్రీవారి దర్శనార్థం రష్యాకు చెందిన భక్తుల బృందం తిరుమలకు చేరుకుంది. 300 రూపాయల ప్రత్యేక దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. వీరంతా చీరను కట్టి, పంచె, దోవతీలు ధరించి, తిరునామాలతో భారతీయ సంప్రదాయంలో కనిపించారు. వీరితో ఫోటోలు దిగేందుకు ఆలయం వద్ద భక్తులు మక్కువ చూపారు.

వేగవంతంగా భూ రీసర్వే



రికార్డులు పరిశీలిస్తున్న డీటీ, సర్వేయర్లు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కంచన పుత్తూరు గ్రామ రెవెన్యూలో భూముల రీసర్వే శరవేగంగా జరుగుతోంది. కంచనపుత్తూరు గ్రామ రెవెన్యూలో 2,200 ఎకరాల భూమి ఉంది. అందులో 1200 ఎకరాలకు పైగా సర్వే పూర్తయింది. తహసీల్దార్ భార్గవి మాట్లాడుతూ భూముల రీ సర్వేతో భూసమస్యల పరిష్కారం అవుతాయని, ఇందుకోసం భూములకు సంబంధించిన రికార్డులను పక్కాగా సిద్ధం చేసినట్లు తెలిపారు. సర్వే అనంతరం సాగులో ఉన్నవారి పేరుపై పాసు పుస్తకాలు వస్తాయని, ఆన్‌లైన్‌లో వారి పేరు నమోదు అవుతుందన్నారు. భూమి కొలతలు పక్కాగా ఉంటాయని, హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఉపనిషత్ సారమే నిజమైన విద్య

తిరుమల: అభయాన్ని, అమృతత్వాన్ని, ఆనందాన్ని శాశ్వతంగా ప్రసాదించేవి ఉపనిషత్తులని, వీటిని అందరూ అధ్యయనం చేయాలని రాష్ట్రపతి పురస్కార గ్రహీత ఆచార్య రామసూర్యనారాయణ తెలిపారు. తిరుమలలోని నాద నీరాజనం వేదికపై జరుగుతున్న శ్రీనివాస వేద విద్వత్ సదస్సులో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఉపనిషత్తుల సందేశం అనే అంశంపై ఉపన్యసించారు. తొలుత పండితులు వేద పారాయణం చేశారు. ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి ఆకెళ్ల విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దయే భక్తులకు రక్ష

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వరుడికి ఉండే దయాగుణమే భకక్తుల పాలిట గొప్పవరంగా భావించాలని ప్రముఖ సంస్కృత పండితులు, ధార్మిక సంప్రదాయ ప్రవచన కర్త సముదద్రాల శఠగోపాచార్య పేర్కొన్నారు. తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం తిరుమల ఆస్థాన మండపంలో ఆళ్వార్‌దివ్య ప్రబంధ ప్రాజెక్టు, టీటీడీ తరఫున ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో శ్రీవేదాంత దేశికులు రచించిన శ్రీ వేంకటేశ్వరుని దయా(గుణ) శతకంపై ఆయన ఉపన్యసించారు.

నాలుగున్నరేళ్లుగా సుపరిపాలన

- రూ.కోటితో రేణిగుంటలో కాలువల నిర్మాణం
- అర్హులందరికీ ఇళ్ల పట్టాలు
- గడప గడపలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



మంచినీళ్ల గుంట సుందరీకరణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట : పేదల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తూ, నాలుగున్నరేళ్లుగా సుపరిపాలన అందిస్తున్నామని, టీడీపీ హయాంలో పెత్తందార్ల రాజ్యం నడిచేదని, రెండింటికీ వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం రేణిగుంటలో రూ.39.5లక్షల వ్యయంతో చేపట్టనున్న రాణిగుంట (మంచినీళ్ల గుంట) సుందరీకరణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ అందించిన రేణిగుంట మండలం అంటే తనకు ప్రత్యేక అభిమానమన్నారు. అందుకే మండలాన్ని దత్తత తీసుకున్నామని, అభివృద్ధి..సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. సుమారు 14వేల ఇంటి పట్టాలను పంపిణీ చేశామని వివరించారు. ప్రతిపక్షాలు కోర్టులో కేసులు వేయడం వల్ల కొందరికి పట్టాలు ఇవ్వలేకపోయామని, మరో రెండు నెలల్లో ఆ సమస్యను అధిగమించి లబ్ధిదారులకు స్థలాలు అందిస్తామని తెలిపారు. రూ.40లక్షలతో బుగ్గవీధిలో, రూ.60లక్షల వ్యయంతో పాంచాలినగర్‌లో డ్రైనేజీలను నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతగా భావించి ఎవరికి ఏ కష్టం వచ్చినా తోడుగా నిలుస్తున్నామన్నారు. పేద ముస్లిం కుటుంబంలో వివాహం జరిగితే మేనమామ సాంగ్యం కింద బీరువా, మంచం, టీవీ అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పేదలు ఎవరైనా మృతి చెందితే దహనసంస్కార ఖర్చుల నిమిత్తం రూ.10వేల సాయం చేస్తున్నామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలవకుండా పక్క రాష్ట్రాల్లో దాక్కున్న వారు, ఇప్పుడు ఎన్నికలు సమీపించే సరికి విమర్శలు గుప్పిస్తుంటే జాలి వేస్తోందని వివరించారు.

ఫోన్ చేస్తే చాలు..

పార్టీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేరుగా తమకు ఫోన్ చేస్తే వెంటనే స్పందిస్తూ చేయూతనందిస్తున్నామని తెలిపారు. ఫ్లైఓవర్ వంతెన బాధితులు 120మందిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని, తాము అధికారంలోకి వచ్చాకే ఇంటిపట్టాలు అందించామని వెల్లడించారు. మంచినీళ్ల గుంట సుందరీకరణకు పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీపీ కలపాటి హరి ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు టి.సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, జువ్వల దయాకర్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు రసూల్, పట్టణ అధ్యక్షుడు రఫీవుల్లా, మండల అధ్యక్షుడు ఖదీర్, మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు జువ్వల ధనంజయరెడ్డి, మన్యం శ్రీనివాసులురెడ్డి, నాగరాజు, ఇరానీ ఖాదర్, మల్లిరెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సాయినాథునికి రూ.11లక్షల విరాళం



విరాళం అందిస్తున్న దాత రాధిక

శ్రీకాళహస్తి : పట్టణంలోని చెన్నైరోడ్డులో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరానికి బుధవారం స్థానిక దక్షిణ కైలాస్‌నగర్‌కు చెందిన ఊటుకూరు రాధిక తన భర్త సుబ్రమణ్యం జ్ఞాపకార్థం రూ.11లక్షలు విరాళంగా అందజేశారు. దాతను మందిరం కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కమిటీ సభ్యులు నాగరాజు, రాముగుప్తా, జగదీశ్వరరెడ్డి, రామారావు, సుబ్రమణ్యంనాయుడు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

జోరుగా సజ్జ పంట నూర్పిడి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, పుత్తేరి, ఆలత్తూరు. వెస్టువరత్తూరు, కారణి, గ్రామాల్లోని రైతులు సజ్జ పంట నూర్పిడి జోరుగా చేస్తున్నారు. గ్రామాల్లో 130 ఎకరాల్లో సజ్జ పంటను సాగు చేశారు. పంట పండడంతో రైతులు నూర్పిడి పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. కూలీలకు రోజుకు రూ.250 కూలీ గిట్టుబాటు అవుతుంది. వాణిజ్య పంట కావడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్, ధర బాగుందని రైతులు అంటున్నారు. ఎకరాకు అన్ని ఖర్చులు పోను రూ.30 వేలు మిగులుతుందని చెబుతున్నారు.

లోకోస్ నిర్వహణతో పారదర్శకత

నారాయణవనం: డ్వాక్రా సంఘాల ఖాతాలను లోకోస్ యాప్ ద్వారా పారదర్శకంగా నిర్వహించే అవకాశం ఉందని ఏపీఎం మమత అన్నారు. బుధవారం స్త్రీశక్తి భవన్‌లో నారాయణవనం, వడమాలపేట మండలాల సంఘమిత్రలకు ఒక్క రోజు లోకోస్ యాప్ నిర్వహణపై శిక్షణ తరగతులను నిర్వహించారు. మమత మాట్లాడుతూ ఇదివరకు సంఘాల లెక్కలను మ్యానువల్‌గా నిర్వహించడంతో తప్పులు నమోదు కావడం, అవకతవకలకు అవకాశం ఉండేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో సంఘంలోని ప్రతి సభ్యురాలి వ్యక్తిగత ఖాతా, సంఘం ఖాతా లావాదేవీలు నమోదు అవుతాయని తెలిపారు. లావాదేవీలపై పర్యవేక్షణ ఉండడంతో అవినీతికి అవకాశం ఉండదన్నారు. ఇకపై సంఘమిత్రలు తమ పరిధిలోని సంఘాల ఖాతాల లావాదేవీల వివరాలను లోకోస్ యాప్ ద్వారా మాత్రమే నిర్వహించాల్సి ఉంటుందని ఆమె అన్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది గెరిటారెడ్డి, రజనీకాంత్ యాప్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. రెండు మండలాల సీసీలు పాల్గొన్నారు.



యాప్ నిర్వహణపై శిక్షణ ఇస్తున్న డీఆర్‌డీఏ సిబ్బంది

అంగన్‌వాడీలకు వెళ్లేలా అలవాటు చేయాలి

ఏర్పేడు: తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లే విధంగా అలవాటు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్త విజయ అన్నారు. బుధవారం మండలంలోని మడిబాక అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లులతో ప్రీ స్కూల్ సంసిద్ధత కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ పిల్లలను కేంద్రానికి పంపాలని సూచించారు. ప్రభుత్వం పిల్లలకు అన్ని వసతులను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

రేణిగుంట: ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుభోదయ ఆస్పత్రి ఆధ్వర్యంలో జేపీ ఐ కేర్ అండ్ అండ్ జేపీ డెంటల్ సౌజన్యంతో రేణిగుంట పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. రేణిగుంట సర్పంచ్ నగేషం శిబిరాన్ని ప్రారంభించారు. కీళ్లవాతం, కంటి, పంటి సమస్యలకు సంబంధించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సుభోదయం ఆస్పత్రి డాక్టర్ పి.దామోదరం, జేపీ డెంటల్ డాక్టర్ ప్రసాద్, పురుషోత్తం, డాక్టర్ తేజోవతి, డాక్టర్ ఇసాక్ నెల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ధరణి డిపాజిట్‌కు అధిక వడ్డీ

రేణిగుంట: చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రవేశపెట్టిన ధరణి డిపాజిట్ పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని రేణిగుంట బ్రాంచ్ బ్యాంకు మేనేజర్ జి.పార్వతి కోరారు. ఆమె బుధవారం బ్యాంకులో మాట్లాడుతూ ఈ పథకం డిపాజిట్ స్వీకరణ ఈనెల 31వ తేదీ వరకు మాత్రమే ఉంటుందన్నారు. కనీస డిపాజిట్ రూ.1,000 పైబడి స్వీకరిస్తామన్నారు. ఈ పథకంలో డిపాజిట్లపై 8శాతం వడ్డీ చెల్లిస్తామని, సీనియర్ సిటిజన్లకు 0.50శాతం అదనపు వడ్డీ చెల్లించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఖాతాదారులు డిపాజిట్ చేసిన మొత్తానికి ఇన్సురెన్స్ గ్యారెంటీ స్కీం రక్షణ ఉంటుందన్నారు. బ్యాంకు సీఈవో ఇ.మనోహర్ గౌడ్, చైర్మన్ మొగసాల రెడ్డెమ్మ ఆధ్వర్యంలో ఖాతాదారులకు, రైతులకు నాణ్యమైన సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ధరణి డిపాజిట్ పథకానికి సంబంధించి మరిన్ని వివరాల కోసం రేణిగుంట బ్రాంచ్‌లో సంప్రదించవచ్చని మేనేజర్ కోరారు.

31 వరకు డిపాజిట్‌కు అవకాశం

ఏర్పేడు: సహకార కేంద్ర బ్యాంకులో నూతనంగా ప్రవేశపెట్టిన ధరణి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పథకం ఈనెల 31వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఖాతా దారులు ధరణి డిపాజిట్ ద్వారా 8 శాతం వడ్డీని పొందవచ్చని తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌కు అదనంగా 0.50 శాతం వడ్డీ ఉంటుందన్నారు. 450 రోజులకు మాత్రమే పథకం వర్తిస్తుందని తెలిపారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ





వైద్యులతో మాట్లాడుతున్న బియ్యపు పవిత్రారెడ్డి, సత్యవేడు: కన్నావరంలో వైద్య పరీక్షలు, ఏర్పేడు: మందుల కిట్ల అందజేత

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకురాలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామ సచివాలయ పరిధిలో వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 600మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రెఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఎంపీడీవో రఫీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, సర్పంచులు పుట్టం బాలిరెడ్డి, రమణయ్య, ఎంపీటీసీ సభ్యురాలు సుమలత, సచివాలయ కన్వీనర్ శివ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సత్యవేడు: అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కన్నావరం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి రుయా డాక్టర్లు ప్రత్యూష, పృథ్వీని, రాజష్, పీహెచ్‌సీ వైద్యాధికారి గుణశేఖర్ బృందం 498 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసింది. 17 మందికి కంటి అద్దాలు అందజేశారు.

చెల్లూరులో 290 మందికి వైద్య పరీక్షలు

ఏర్పేడు: మండలంలోని చెల్లూరులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. 290 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సురక్ష మందుల కిట్లు అందజేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కూనాటి రమణయ్య యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, సర్పంచ్‌లు జ్ఞానప్రసూన, జయముని, ఎంపీటీసీ సభ్యురాలు రాధ, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, సింగిల్‌విండో అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందన

శ్రీకాళహస్తి: కరాటే జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులను వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు, ఆప్కో మాజీ డైరెక్టర్ మిద్దెల హరి అభినందించారు. బుధవారం తన కార్యాలయంలో వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. హరహరబావివీధికి చెందిన కరుణాకర్‌గుప్తా కుమార్తెలు చెన్నైలోని సాంతొం పాఠశాలలో జరిగిన సారిన్ రియూ అండర్ 10, 11 కరాటే పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరు పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో 6, 7వ తరగతి చదువుతున్నారు.



చిన్నారులను అభినందిస్తున్న మిద్దెల హరి

కవి సామ్రాట్‌కు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: ఆర్ఎస్ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు బుధవారం ఘన నివాళులర్పించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు చిత్రపు హనుమంతరావు, సీఆర్‌కే.శేషగిరిరావు, బ్రాహ్మణ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

వాహన సేవలో ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవలో రెండు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆవిష్కరించారు. పుస్తకాలు మొల్ల రామాయణం (పరిమళ వ్యాఖ్యతో)–ఆచార్య కె.మలయవాసిని, విష్ణు పురాణం (కన్నడ)–డాక్టర్ సీఎస్ ఊర్మిళ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జేఈఓ సదా భార్గవి, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, వీజీఓ బాలిరెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణ శర్మ, ఉప సంపాదకులు నరసింహాచార్య పాల్గొన్నారు.



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి

శరణం మాతా... శరణం





శ్రీకాళహస్తి: ముత్యాలమ్మఆలయంలో, అన్నపూర్ణగా కాళికాదేవి, చాముండేశ్వరీదేవి






ఏడుగంగమ్మల ఆలయంలో.., బీఎన్‌కండ్రిగ: గాయత్రీదేవిగా.., ఏర్పేడు: మర్రిమందలో.., శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో..

శ్రీకాళహస్తి: శరణం మాతా.. శరణం అంటూ భక్తులు అమ్మవార్లను దర్శించి ఆనంద పరవశులయ్యారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాలోని అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఉదయం నుంచి ఆలయాల్లో రద్దీ సాగింది. మహిళలు ఆలయాల్లో దీపారాధనలు చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో శ్రీజ్ఞానప్రసూనాంబ అమ్మవారి ఉత్సవమూర్తి కూష్మాండదేవిగా భక్తులకు అభయ ప్రదానం చేశారు. అమ్మవారిని రంగులగోపురం వరకు ఊరేగించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో భక్తుల సందర్శనార్థం కొలువుదీర్చారు. అలాగే ఆలయంలోని కనకదుర్గమ్మ అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తిని శక్తి వినాయక, సుబ్రహ్మణ్యస్వామిగా అలంకరించారు. బీపీఅగ్రహారం గంగమ్మ అన్నపూర్ణదేవిగా, భాస్కరపేటలోని చాముండేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, ఏడుగంగల అమ్మవారు కుష్మాండదేవిగా, ముత్యాలమ్మ మహాలక్ష్మిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కనకాచలం కింద బియ్యపు కృష్ణారెడ్డి మండపం వద్ద ఏర్పాటు చేసి కనకదుర్గమ్మను మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గాయత్రీదేవీ పాహిమాం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల శ్రీపచ్చాలమ్మ ఆలయంలో దసరా శరవన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను అందించారు.

ఏర్పేడు మండలంలో..

శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని మర్రిమంద రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాపానాయుడుపేట భద్రకాళి, అంజిమేడు గంగమ్మ, గుడిమల్లం ఆనందవల్లీ దేవి, చిందేపల్లిలో పార్వతీసమేత సిద్ధేశ్వర స్వామి, మూలకండ్రిగ ఓసూరమ్మ తదితర ఆలయాల్లో అమ్మవారికి విశేషాలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు.

సత్యవేడులో..

పట్టణంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో లలితాదేవి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ధనలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

కామాక్షిదేవిగా అవనాక్షమ్మ

నారాయణవనం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు కంచి కామాక్షిగా భక్తులకు ఊంజల్‌సేవలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సర్కారు అభిషేకాన్ని నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. టీటీడీ స్థానిక ఆలయాల ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు తదితరులు పర్యవేక్షించారు. మండలంలోని కైలాసనాథకోనలోని కామాక్షాంబిక సమేత కై లాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులను కటాక్షించారు. స్థానిక ధర్మరాజుల ఆలయంలో ద్రౌపదీదేవి కరుమారియమ్మ ఊంజల్‌సేవలో అనుగ్రహించారు.

గరుడసేవకు పటిష్టమైన భద్రతా చర్యలు

తిరుపతి అర్బన్: గరుడోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో సెక్యూరిటీ సిబ్బందితో పాటు సేఫ్టీ డ్రైవింగ్ బోధకులతో సమావేశం అయ్యారు. సమష్టిగా పనిచేసి విజయవంతంగా గరుడోత్సవం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సెక్యూరిటీ జిల్లా అధికారి ధర్మతేజ, ఆర్టీసీ డెప్యూటీ సీటీఎం భాస్కర్, మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, పర్సనల్ ఆఫీసర్ పార్థసారథి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీపీటీవో

రమణీయం.. శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నాటకంలో ఓ దృశ్యం

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో బుధవారం రాత్రి సురభి వినాయక నాటక మండలి వారు ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం పౌరాణిక పద్యనాటకం రమణీయంగా సాగింది. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహతిలో కళాకారులు ఈ ప్రదర్శన చేపట్టారు. అన్నమాచార్య కళామందిరంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల బి.చిన్నమదేవి, ఎన్.ప్రసాద్ బృందం ప్రదర్శించిన భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. శ్రీరామచంద్ర పుష్కరిణి కళా వేదికపై కళాకారులు వి.వేదనారాయణి, వి.సంధ్యశేఖర్ గాత్ర కచేరి శ్రవణానందకరంగా సాగింది.



కళాకారుల నృత్య ప్రదర్శన